శ్రీ కె. బి. కృష్ణ

# మరణం ధ్రువమ్

పుట్టినవాడు గిట్టక తప్పదు. మరణం అనేది ప్రతివ్యక్తి తప్పక ఎదుర్కోవలసిన సంఘటన. అయితే ప్రతివ్యక్తి ఎన్ని సంవత్సరాలు బ్రతుకుతాడు? అతని ఆయుర్దాయం అతనికి తెలుస్తుందా?

శ్రీరామమూర్తిగారు పరమ నైష్ఠికుడు. త్రిసంధ్యలు వార్చకుండా ఆయనకు రోజు గడవదు క్షణం క్షణం రామనామ స్మరణ

ఆయనకు నలుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ అమలులోలేదు అందరికి వివాహాలు చేసి బాధ్యతలు వదిలించుకున్నారు. అందువలన ఆయన నిశ్చింతగా వున్నారు కష్టార్జితంతో కట్టుకున్న స్వంత ఇంట్లో వుంటూ, పెద్దలు సంపాదించి పెట్టిన భూమిని సాగుచేయించుకుంటున్నారు మూడు వాటాలు అద్దెకు ఇచ్చి, తాము ఒక వాటాలో వుంటున్నారు.

భార్య రామలక్ష్మమ్మగారు. ఆయనకు తగిన భార్య. ముమ్మూర్తులా లక్ష్మీదేవి దానధర్మాలు తెలిసిన అన్నపూర్ణ భర్తకు ఏ సమయంలో ఏది కావాలో సమకూర్చి ఆయనతోపాటుగా భగవంతుని స్మరించడం ఆమె విధి

తీరికగా వున్నప్పుడు, కొడుకులు, కోడళ్ళ గురించి, కూతుళ్ళ అల్లుళ్ళ గురించి ఆలోచించుకొని సంబరపడుతుంటారు ఆ దంపతులు. ప్రతీ వేసవిలోనూ పిల్లల శెలవులకు కొడుకులు కూతుళ్ళు శ్రీరామమూర్తిగారి ఇంటికే రావాలి అది ఆయన కోరిక కోడళ్ళను కూడా కూతుళ్ళతో సమానంగా చూసే సమదృష్టిగల వారాయన

"ఏమోయ్ శెలవులు ఇంకా ఎన్ని రోజులకు మొదలవుతాయంటావ్?" రాత్రి భోజనం చేసిన తరువాత వక్కపొడి నములుతూ, కాళ్ళ దగ్గర కూర్చున్న లక్ష్మమ్మగారిని అడిగేరు

"భలేవారండీ ఈ రోజేగదా ఉత్తరాలు వచ్చాయి అందరి దగ్గరనుండి, శెలవులకు వస్తామని ఇంక రెండు రోజులుంది"

"పాలవాడికి, పెరుగువాడికి, నెయ్యివాడి చెప్పు ఎక్కువలు కావాలని పిల్లలు అందరూ వస్తారు కదా, ఏమైనాతిండి కి చెయ్యి రేపు బజారుకు వెళ్ళి బిస్కట్లు, చాక్లెట్లు తీసుకువస్తాను" అన్నారు శ్రీరామమూర్తిగారు.

"మీరేమీ హైరాన పడకండి. నేను అన్నీ చూసుకుంటాను"

వరండాలో మడత మంచంమీద పడుకున్న ఆయనకు, లక్ష్మమ్మగారు కాళ్ళు పడుతుంటే నిదరపోయారు.

## 2

సూర్యభగవానుడు మామూలుగా తన దివ్య కిరణాలతో ఈ లోకాన్ని వెలుగుతో నింపుతున్నాడు. అది మే నెల కావడంవలన, రోహిణీకార్తె కావటం మూలాన్న ఉదయం ఆరున్నర గంటలకే సూర్యకిరణాలు చురుక్కుమంటున్నాయి.

శ్రీరామమూర్తిగారు అనుష్ఠానం చేసుకుని పడకకుర్చీలో కూర్చుని కాఫీ సేవిస్తున్నారు

ఆయన మనస్సును తనకురాత్రి వచ్చిన కల సూర్యకిరణాల వేడికన్న మిన్నగా దహించి వేస్తోంది.

అయితే ఇది జరుగుతుందంటావా శ్రీ రామా?

నన్ను నీ దగ్గరకు జేర్చుకుంటున్నావా?

నీసన్నిధిలో కూర్చుని రామనామ స్మరణ చేసుకుంటూ, రామదాసు కీర్తనలు మనసారా పాడుకుంటాను స్వామీ, నన్ను కరుణించు స్వామీ — అయితే లక్ష్మిని ఎవరు చూస్తారు? అదిగో మనస్సు వశం తప్పుతూంది పెద్ద కొడుకు మంచివాడు కోడలు కూడా చాలా మంచిది ఈ ఆలోచన వచ్చేక మనసుకు ఊరట కలిగింది

"లక్ష్మీ"

"ఏమిటీ హడావిడి పొద్దున్నే" అంటూ కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"కూర్చో నీతో మాట్లాడాలి"

"వంటయితే పెందరాళే భోజనం చెయ్యొచ్చు మీకు అసలే నీరసం తరువాత మాట్లాడుకోవచ్చులెండి"

"లక్ష్మీ నేను లేకుండా బ్రతకగలవోయ్"

"బాగుందండి చోద్యం పొద్దున్నే ఈ ఆలోచనలు ఎందుకు మీకు?"

"రాత్రి నాకుకలవచ్చింది హనుమజ్జయంతినాడు సాయంకాలం ఆరుగంటలకు నేను దైవసన్నిధికి చేరుకున్నట్లుగా శ్రీరామచంద్రు

మూర్తి తయారుగా ఉండమన్నాడే." పచ్చివెలక్కాయ తింటే గొంతులో పట్టేసినట్లు, ముద్ద దిగకుండా బాధపడుతున్నట్లు ఆయన గొంతు గాద్గదికమైంది.

లక్ష్మమ్మగారికి, ఉదయమే, ఈ విషయం, తన భర్తకు వచ్చినది కలే అయినా అగ్నిపర్వతం పగిలి తనవైపుకు అతి వేగంగా లావా వస్తున్నట్లుగా గజ గజ వణికి పోతూంది ఆమె.

ఒకవేళ నిజమైతే —

అమ్మో ఆయన లేకుండా నేను వుండలేను.

"పిచ్చిగాని కలలు ఎక్కడైనా నిజం అవుతాయా?" ఇన్ని ఆలోచనలతో కన్నీటి తెరలలో శూన్యాన్ని చూస్తోందామె.

"పిచ్చి లక్ష్మి బాధపడకు. గీతలో చెప్పినట్లు, మృత్యువు అనేది చిరిగిన పాత వస్త్రం తీసి క్రొత్త వస్త్రం ధరించినట్లే మన జీవితం శాశ్వతంగాని వాటి కోసం తాపత్రయం అవివేకం." అని సముదాయిస్తున్నారామెను.

ఆయన మనస్సులో లోతు తెలియని దిగులు. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, ఆత్మీయులు, స్నేహితులు, వీళ్ళందర్నీ వదిలి ఈ ఆత్మ పయనించాలి పైకి - పైపైకి. ఈలోకం శాశ్వతం కాదు. ఈ భవ బంధాలు వెట్టిప్రేమలు. ఇవన్నీ మనస్సును కట్టిపడేసి ఒక్కోసారి భగవంతుని స్మరించడానికి కూడా అవకాశం ఇవ్వవు

అయితే ఇవన్నీ జీవితానికి అవసరం లేదా? అవసరమే. మానవ జన్మ ఎత్తేక కొన్ని ధర్మాలు ఆచరించాలి. షేక్స్పియర్ "As you like it" లో చెప్పినట్లు, మనిషికి ఏడుదశలు—బాల్యం, విద్యార్థి దశ, ప్రేమికుడు, వీరుడు, న్యాయనిర్ణేత, వృద్ధుడు, మరణం ఆసన్నమైనవాడు. అందుకని తను చివరి దశలోవున్నాడు. మరణం సమీపిస్తున్నదని బాధపడటం అవివేకం.

ఎదురింటి వారి అబ్బాయిని పిలిపించి తన ప్లీడరును వెంటనే రమ్మని కబురు చేశారు ఎదురింటి శేషాద్రిగారు వచ్చారు.

"ఏమిటి మూర్తిగారూ ప్లీడరు కోసం కబురు చేశారుట. ఏమయింది?"

రాత్రికి తనకువచ్చిన కల వివరం చెప్పారు మూర్తిగారు.

పగలబడినవ్వేరు ఆయన. "శేషాద్రిగారూ నవ్వకండి, ఇది నిజం అవుతుందని నాకు ఎందుకో గట్టి నమ్మకంగా వుంది." అన్నారు మూర్తిగారు.

ప్లీడరు గారు వచ్చారు. ఇల్లు నాలుగు వాటాలు నలుగురు కొడుకులకు, ఎనిమిది ఎకరాలు పొలం నలుగురు కొడుకులకు, నలుగురు కూతుళ్ళకు సమానంగా వ్రాశారు. ఈ తతంగమంతా కన్నీటి తెరలలో గమనిస్తూంది లక్ష్మమ్మగారు.

"లక్ష్మమ్మగారూ విచారించకండి. ఈపని ఎప్పుడైనా చేయ వలసిందే. ఏమీ జరగదు. అయితే శ్రీరామమూర్తి గారు మాత్రం చాలా దూరదృష్టితో ఈపని చేశారు. అనుకోకుండా ఇంటి యజమాని చనిపోతే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, స్థిర చరాస్తుల కోసం తగవులాడుకొని చితికి పోయిన సంసారాలు నాకు ఎన్నో తెలుసు." అని శేషాద్రిగారు ఇద్దర్నీ సముదాయించారు.

3

కొడుకులు, కోడళ్లు, కూతుళ్ళు, అల్లుళ్ళు వస్తారనుకున్న రోజు వచ్చింది.

పెద్ద కొడుక్కి నలుగురు సంతానం.
రెండవ కొడుక్కి ముగ్గురు పిల్లలు.
మూడవ కుమారుడికి ఇద్దరే పిల్లలు
నాలుగవ కొడుక్కి ఇంకా సంతానంలేదు.

నలుగురు అమ్మాయిలకు కలిపి పదిమంది సంతానం. ఒక రోజు అటూ ఇటూగా అందరూ రావటంతో, ఇల్లంతా నిండిపోయి పెళ్ళివారి ఇల్లులావుంది.

అందరూవచ్చేక లక్ష్మమ్మగారు ఏడుస్తూ విషయం చెప్పింది అందరూ ఒకేసారి గొల్లుమన్నారు. ఏం జరిగిందోనని శ్రీరామ మూర్తిగారు లోపలకువచ్చారు. అందరూ ఆయన్ని చుట్టుముట్టేరు.

"నాన్నగారూ! మీకు ఏంజరగదు మీరు ఎప్పుడూ ఆరా ధించే శ్రీరామచంద్రమూర్తి మాకు అన్యాయం చెయ్యడు అన్నారు కొడుకులు, కూతుళ్ళు.

"మీరందరూ కంగారు పడకండి. భగవంతుడు నాకు సమయం దగ్గరైందని హెచ్చరించాడు. అయితే ఒక్క విషయం వినండి. మీ అమ్మనుమాత్రం జాగ్రత్తగా చూసుకోండి. అమ్మ పెద్దాడి దగ్గర వుంటుంది.

ఎటువంటి ప్రలోభాలకు లొంగకండి. ఆస్తి అందరికి సమానంగా విల్లు వ్రాశాను. సంతోషంగా అందరూ ఇలాగే ప్రతి వేసవికి సెలవులకు కలుసుకోండి. నేను పైనుండి ఆనందంతో చూస్తాను." 'అని ఆయన అనగానే, నలుగురు కొడుకులు ఆయన్ని మాట్లాడనియ్యకుండా ఆపేశారు బయట వరండాలో కూర్చున్నారు. లోపల లక్ష్మమ్మగారి మాటలు, కోడళ్ళు, కూతుళ్ళ మాటలు పిల్లల పేచీలు చిన్న సంతలా వుందా ఇల్లు.

భాగ్యదర్శిని విశ్వసించండి. హెచ్చు సహాయము పొందండి.

# భాగ్యదర్శి

## సౌభాగ్యానికి సంకేతం

మీ సమస్యలు పరిష్కరించుకొనండి
భవిష్యత్‌ను ఆదా చేసుకొనండి

మీ కుమార్తెల వివాహాలు సంతోషంగా చేయండి,
మీ పిల్లలకు చక్కని చదువులు చెప్పించండి,
ఎదురు చూడని అవసరాలకు ఆదుకోండి

# స్వంత ఇంటిని ఏర్పాటు చేసుకోండి

సులభంగా మీ డబ్బు పెరుగుతుంది
ఆకర్షణీయమైన డివిడెండ్లు గల చిట్ సిరీస్‌లో
సభ్యులుగా చేరండి

మమ్మల్ని విశ్వసించండి — భాగ్యపథంలో మీకు
మార్గం సుగమం చేయగలము.

# భాగ్యదర్శి

## చిట్ ఫండ్స్ ఫైనాన్స్ &
## ఇన్వెస్ట్‌మెంట్స్ (ప్రై) లిమిటెడ్

3-5-873, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గుడ,
హైదరాబాద్ - 500001
ఫోన్స్ 221041 & 220354

చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఎం. వి. సుబ్బారావు

ఆ ఇంట్లో రోజులు చాలా భారంగా గడుస్తున్నాయి ఒక రోజు శివాలయంలో రుద్రాభిషేకం — ఇంకో రోజు నవగ్రహాల జపం రోజూ ఆ ఇంటి పురోహితునిచే మృత్యుంజయ స్తోత్ర పారాయణం.

ఆ రోజు వచ్చింది అందరికీ దిగులు పిల్లలంతా మామూలుగా అనుకుంటున్నారు.

మూర్తిగారు ఆ రోజు ఉదయమే లేచి పూజాకార్యక్రమాలు చేసుకున్నారు

పగలు తనకు ఇష్టమైన వంటకాలు చేయించుకుని భుజించారు, విశ్రమించారు

మధ్యాహ్నం నిద్రలేచి త్వరగా వంట చెయ్యమన్నారు ఎప్పుడూ రాత్రి తొమ్మిదికిగాని భోజనం చెయ్యని ఈయన సంగతి ఏమిటని అనుకుంటూ ఆమె వంట చేసింది

బయట వరండాలో అందరినీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని కూర్చున్నారు శ్రీరామమూర్తిగారు శేషాద్రిగారు కూడా వచ్చేరు

అందరికీ ఒక పరీక్ష ఇది జరగదులే అని అనుకున్నా, వారి మనసుల్లో దుఃఖం గూడు కట్టుకుని వుంది

"శేషాద్రీ ఒకవేళ నేను చనిపోయినా ఏం గొడవలు జరగకుండా పిల్లలను —" ఆయన నోటికి చెయ్యి అడ్డం పెట్టి లక్ష్మమ్మగారు "దయచేసి మీ కాళ్ళు పట్టుకుంటాను ఇక మాట్లాడకండి" అంది సజల నయనాలతో

సమయం ఆరు అవుతోంది.

శ్రీరామమూర్తిగారు కళ్ళు మూసుకుని
"శ్రీరామ రామ రామేతి [illegible]
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే" జపం చేసుకుంటున్నారు అందరూ కళ్ళు మూసుకుని భగవన్నామ స్మరణ చేసుకుంటున్నారు.

"లక్ష్మీ ఓ లక్ష్మీ—వారేయ్ మీ అమ్మను చూడండిరా" అనే తండ్రి కేక విని అందరూ కళ్ళు తెరిచారు

శ్రీరామమూర్తిగారి పాదాల దగ్గర జీవం లేని లక్ష్మమ్మగార్ని చూసి అందరూ గొల్లుమన్నారు

తన ఎదురుగా వున్న శ్రీరామచంద్రమూర్తి పటంలో శ్రీరామమూర్తిగారికి కళ్ళల్లో నీరు చేరటంవల్ల క్షణంసేపు సీతమ్మ తల్లి కనుపించలేదు